సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 11 । నవంబర్ । 2023



ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి

డిసెంబర్ 15 నుంచి నిర్వహించే ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు.

-IIలో



కానిస్టేబుల్ ఆత్మహత్య

డీసీబీఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే రవి (36) అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

-IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.380
రెండోరకం	రూ.200	రూ.298

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 262 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దీపావళి రోజున పాఠశాల తెరిస్తే చర్యలు

రాయచోటి: దీపావళి రోజున ప్రైవేటు పాఠశాలలు తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నమయ్య జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించినట్లు ఫిర్యాదులు అందితే ఆ పాఠశాలలపై డిప్యూటీ విద్యా శాఖ, మండల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: కార్తీకమాసం పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ నెల 20, 27, వచ్చే నెల 4వ తేదీల్లో ఈ బస్సులు మదనపల్లె నుంచి ఉదయం 5.30 గంటలకు బయలు దేరి తలకోన, ముక్కోటి, గుడిమల్ల, శ్రీకాళహస్తి, కపిలతీర్థం దర్శనం చేసుకుని రాత్రికి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రానూ పోనూ ఛార్జీలు రూ.600 చెల్లించాలన్నారు. వివరాలకు 7382875034, 7981753344ను సంప్రదించాలన్నారు.

రైతులకు ధృవీకరణ పత్రాలు



ఆర్బీకే కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న చంద్రనాయక్

రామాపురం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్ చేయించుకున్న రైతులు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల ద్వారా ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్బీకేలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

ఆత్మీయ పలకరింపు

- సొంతమనుషుల్లా ఒకచోట చేరిన నేతలు
- సామాన్యులతో మమేకమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- నూతనంగా నిర్మించిన రెండు పోలీసుస్టేషన్లు ప్రారంభం



ఇడుపులపాయ నెమళ్లపార్కులో వేముల మండల ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: వారంతా సొంత మనుషులు. కష్టసుఖాల్లో వెన్నంటి నడిచిన సైనికులు. విపత్కర పరిస్థితుల్లో మనోధైర్యం నింపి, మీ వెంట మేమున్నామని చాటి చెప్పి, రాష్ట్రం వైపు నడిపించిన నేతలు. అలాంటి వారంతా ఒక్కచోటికి చేరడంతో ఆత్మీయత ఉట్టి పడింది. శుక్రవారం ఇడుపులపాయలో ఇదంతా ఆవిష్కరితమైంది.సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వేముల మండలానికి చెందిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలను పేరుపేరునా పలికరించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఇంటి పెద్ద కష్ట సుఖాలు స్వయంగా అడిగి తెలుసుకుంటుంటే అక్కడి వారి మోముల్లో ఆనందం పరవళ్లు తొక్కింది.

బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు చేస్తొండారు, మెట్ట భూములు సాగునీళ్లతో తడుస్తున్నాయి. పిల్ల కాలువలకు లైనింగ్ పనులు చేయించండి సార్... 60శాతం మెట్ట భూములు మాగాణిగా మారుతాయి. బెరైటీస్, సున్నపురాయి, సుద్ద బాగా దొరుకుతోంది, వాటి ఆధారిత పరిశ్రమలొస్తే ఇక్కడే యువతకు ఉద్యోగ ఉపాధి లభిస్తోందంటూ వేముల మండల వాసులు వివరిస్తుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రద్ధగా ఆలకించారు. స్థానికులకు పరిష్కార మార్గాలను సూచిస్తూనే, రైతాంగం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి, తర, తమ, వర్గ బేధాలు లేకుండా ప్రజలకు అందిస్తున్న సంక్షేమం వివరాలను సీఎం వివరించారు. మీరంతా అండగా నిలవడంతోనే ఇది సాధ్యమైందని, పులివెందుల నియోజకవర్గ కుటుంబ సభ్యులైన వేముల మండల వాసులకు ధన్యవాదాలు తెలిపారు.

సన్నిహితులు..ఆత్మీయులతో మమేకం...

రెండు రోజుల పర్యటనలో ఓవైపు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలు, సమీక్షలు నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సామాన్యులతో మమేకమయ్యారు అంతరంగికులు సన్నిహితులతో సరదాగా గడిపారు.ఆత్మీయులను ఆలింగనం చేసుకున్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు

అధైర్యపడొద్దు..అండగా ఉంటాం...

ఇటీవల మృతి చెందిన పెండ్లిమర్రి మండల వైఎస్సార్‌సీపీ నేత సీవై రామ్మోహన్‌రెడ్డి కుటుంబసభ్యుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. మోహన్ మా కుటుంబ సభ్యుడు.. మీకు అండగా మేముంటాం. అధైర్యపడొద్దని ఆయన సతీమణి మాజీ ఎంపీపీ అనూరాధ, కుమారుడు శ్రీహర్ష, కుమార్తె శ్రీలక్ష్మిలకు ధైర్యం చెప్పారు. ఇడుపులపాయలోని సీఎం గెస్ట్‌హౌస్‌కు దివంగత రామ్మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యుల్ని పలిపించుకుని వారిని ఓదార్చారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డిలు రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న తీరుతెన్నులు, కుటుంబ పరిస్థితులను వివరించారు. నాన్న లేడనే బెంగ పెట్టుకోకుండా ఉన్నత చదువులు చదువుకోవాలని కుమార్తె శ్రీలక్ష్మికి ధైర్యం చెప్పారు.

పోలీసుస్టేషన్లు ప్రారంభం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జిల్లాలోని ఆర్కేవ్యాలీ, జమ్మలమడుగులో పోలీసు స్టేషన్లు ప్రారంభించారు. రూ.1.75 కోట్లతో ఇడుపులపాయలో పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. రూ.2.75 కోట్లతో జమ్మలమడుగులో నిర్మించిన పోలీసుస్టేషన్‌ను వర్చువల్ ద్వారా సీఎం ప్రారంభించారు. అనంతరం ఇడుపులపాయ పోలీసుస్టేషన్‌లో విజిటర్స్ బుక్‌లో 'ఆల్ ది బెస్ట్' చెబుతూ సీఎం సంతకం చేశారు. స్టేషన్ ఆవరణలో పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ గోవిందరెడ్డి,పోలీసు సిబ్బందితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.



ఇడుపులపాయ సర్పంచ్ నాగమ్మతో కలిసి పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

సీఎం పర్యటన విజయవంతం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు రోజుల పర్యటన జిల్లాలో విజయవంతంగా ముగిసింది. తొలిరోజు రూ.64.54 కోట్లకు చెందిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేపట్టారు. రెండో రోజు రూ.4.5కోట్లతో నిర్మించిన రెండు పోలీసు స్టేషన్లు ప్రారంభించారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ పరిధిలో చోటుచేసుకున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు సీఎం పర్యటనలో పాల్గొని విజయవంతం చేశారు.

గ్రంథాలయ ఉత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఎం, తదితరులు

కడప కల్చరల్: 56వ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్.ఉషారాణి, వేల్పుల రామలింగారెడ్డి రూపొందించిన పోస్టర్లను సీఎం ఆవిష్కరించి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

డిసెంబర్‌లో ఏఎఫ్‌యూకు భూమిపూజ



సీఎంతో మాట్లాడుతున్న ఏఎఫ్‌యూ వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ: డిసెంబర్ నెలలో వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నిర్మాణ పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించినట్లు డా.వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇడుపులపాయలో సీఎంను వారు కలిసి ఈ విషయమై మాట్లాడారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. డిసెంబర్‌లో భూమిపూజ కార్యక్రమం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు.

సామాజిక ప్రభంజనం

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు. ఊరు వాడా కదిలొచ్చిందా.. జన ప్రవాహం పరవళ్లు తొక్కిందా అనిపించింది. నాయకులకు జనం బ్రహ్మరథం పట్టారు. జననేత జగన్ జనంలోకి వచ్చినంత వేడుకగా ఆయన పంపిన సైన్యానికి అడుగడుగునా స్వాగతం పలికారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని ప్రతిన బూనారు. ప్రభుత్వం చేసిన మేలును మంత్రులు, ప్రజాప్రతినిధులు వివరిస్తుంటే సంక్షేమం కింద తమకు అందించిన సాయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుని కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు.

- మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలకు విశేష స్పందన
- దద్దరిల్లిన ములకలచెరువు సామాజిక సాధికార సభ
- అడుగడుగునా నాయకులకు ప్రజల బ్రహ్మరథం
- పీటీఎం నుంచి మద్దయ్యగారిపల్లె వరకు పాదయాత్ర
- దారి పొడవునా బారులుతీరిన జనం



అన్నమయ్య జిల్లా ములకలచెరువులో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన జనం



బస్సు యాత్రలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలంలో శుక్రవారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో చైతన్యం వెల్లివిరిసింది. తమను గుర్తించి ఆర్థిక, సామాజికంగా ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వానికి కృతఘ్నతగా వేలాదిగా తరలి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో ములకలచెరువు మురిసిపోయింది. మంత్రులు మేరుగ నాగార్జున, ఉషశ్రీ చరణ్, గుమ్మనూరు జయరాం, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీ కుంభారవి యాత్రకు హజరయ్యారు. వారు పెద్ద తిప్పసముద్రం సమీపంలోని కింగ్ కళ్యాణ్‌మండపానికి చేరుకోగా భారీ సంఖ్యలో శ్రేణులు తరలి వచ్చారు. అక్కడి నుంచి మధ్యాహ్నం బస్సుపై నుంచి అభివాదం చేస్తూ మంత్రులు, ఎమ్మెల్యేలు పెద్దతిప్పసముద్రం చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్, శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి విగ్రహానికి మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్ పూల మాల వేసి నివాళి అర్పించారు.

దారి పొడవునా బారులు

పెద్దతిప్పసముద్రం నుంచి మద్దయ్యగారిపల్లె వరకు బస్సు యాత్ర సాగింది. పెద్ద సంఖ్యలో వచ్చిన బడుగు, బలహీన వర్గాల ప్రజలు బస్సు ముందు నడుచుకుంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. రోడ్డుకు ఇరువైపులా మహిళలు, ప్రజలు బారులు తీరి స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు. గఅనంతరం అక్కడి దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొంతలపల్లెవద్ద మహిళలు పూలవర్షం కురిపించగా, పులికల్లు వద్ద మహిళలు, స్థానికులు భారీ సంఖ్యలో చేరుకుని బస్సుపై నుంచి అభివాదం చేస్తున్న నేతలపై పూలవర్షం కురిపించారు. అక్కడి నుంచి ములకలచెరువుకు చేరుకోగా జెడ్పీ హైస్కూల్ వద్ద, రహదారిపై ప్రజలు స్వాగతం పలికారు.

జనంతో కిక్కిరిసిన కూడలి

తమ అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషికి అండగా నిలవాలని తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో ములకల చెరువులో సాధికార సభ నిర్వహించిన మూడురోడ్ల కూడలి కిక్కిరిసిపోయింది. పీటీఎం, మదనపల్లె, కదిరి రోడ్లపై జనం నిలబడి మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలు విన్నారు. హాజరైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చేసిన ప్రసంగాలకు స్పందన లభించింది. బీసీ కులాలకు పదవులు ఇచ్చారని చెబుతుండగా స్పందన కనిపించింది.

మహాత్ములకు నివాళులు

సాధికార సభ ప్రారంభానికి ముందు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మహాత్ముల చిత్రపటాలకు నివాళులర్పించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, దివంగత సీఎం వైయస్.రాజశేఖర్ రెడ్డి, కనకదాసు, జ్యోతిరావు పూలే, అల్లూరి సీతారామరాజు, అబుల్ కలాం ఆజాద్, సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు నివాళులర్పించారు.

అభివృద్ధి చేసిన ఏకైక సీఎం జగన్



తరతరాలుగా వెనకబడిన తరగతులు, ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత, అభివృద్ధి సాధించిన ఏకైక సీఎం జగన్. ప్రభుత్వంలో వారికి ఉప ముఖ్యమంత్రి, మంత్రి పదవులు వచ్చాయి. సీఎంగా రూ.6 లక్షల కోట్ల అక్రమార్జన చేసిన చంద్రబాబును ఓడించాలి.

– ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

పెత్తందారులపై యుద్ధం



చంద్రబాబూ గుర్తుంచుకో..సామాజిక సాధికార యాత్ర చేస్తోంది జగనన్న కాదు.. ఆ జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొంది ఆయన కోసం పెత్తందారులపై యుద్ధం చేసేందుకు సిద్ధమైన నాయకులు మాత్రమే. పైత్తందార్లపై యుద్ధంలో జగనన్న సైనికులుగా నిలబడి 175 కు 175 సాధించి తీరుతాం.

– ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

జగన్‌తో అగ్రస్థానం



ప్రభుత్వం ద్వారా ఏం జరగలేదో చెప్పమంటే ప్రతి పక్షం కూడా ఆలోచించి మాట్లాడుతుంది. సీఎం జగన్ సారథ్యంలో అభివృద్ధిలో తంబళ్లపల్లె నెంబర్ వన్‌గా నిలిచింది. త్రంబళ్లపల్లెకు ఏం కావాలని లెటర్ ఇచ్చినా సీఎం జగన్ కాదనకుండా తక్షణమే మంజూరు చేసిన జగన్‌కు మరింత మెజార్టీతో గిఫ్ట్ ఇద్దాం.

– ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

చంద్రబాబు పాలనంతా స్కాంలే..

- రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఘనత బాబుదే
- సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్ని విధాలా అభివృద్ధి
- విలేకరుల సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

పెద్దతిప్పసముద్రం: రాజకీయ వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఘనత చంద్రబాబుకే దక్కిందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంత్రులు మేరుగ నాగార్జున, గుమ్మనూరు జయరాం, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ ఎమ్మెల్సీ కుంభారవి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రంలో విలేకరులతో వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనంతా స్కాంలు, మోస పూరిత వాగ్దానాలే ఉన్నాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల అవినీతి జరిగినట్లు ఆధారాలతో చంద్రబాబు దొరికితే ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. 17 కేసుల్లో నిందితుడిగా ఉన్న చంద్రబాబు కేసులన్నీ కొట్టివేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఎంత వరకు సమంజసమన్నారు. ధైర్యం ఉంటే విదేశాలకు పారిపోయిన స్కిల్ స్కామ్ నిందితులను రప్పించాలని సవాల్ విసిరారు. బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సముచిత స్థానం కల్పించారని ధీమా వ్యక్తం చేశారు. ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా అన్న చంద్రబాబు బలహీన వర్గాల బాగోగులను ఎలా పట్టించుకుంటారని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ సామాజిక, వెనుకబడిన కులాలకు సముచిత స్థానంకల్పించి చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ సమావేశంలో మహమూద్, శివన్న, గణపతిరెడ్డి, డ్రిప్ రమణ, కుమార్‌రెడ్డి, శోభా, శంకర్, కేవీ రమణ, అనిత, కొండా సిద్దార్థ, సుబ్బరాం, సుబ్రహ్మణ్యంరెడ్డి, పప్పు రాజారెడ్డి, రవిచంద్రారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రియాసత్ అలీఖాన్, తమక శంకర్, కార్యం చంద్ర, పీఎస్ మధు, సుబ్బిరెడ్డి, కేశవ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి

సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా పెద్దతిప్పసముద్రం వచ్చిన నాయకులు దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విలేకరుల సమావేశం అనంతరం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మేరుగ నాగార్జున, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్, కర్నూలు, తంబళ్లపల్లి ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కుంభారవి, రామసుబ్బారెడ్డి, తదితరులు తంబళ్లపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్, కృష్ణదేవరాయులు, మద్దయ్యగారిపల్లిలోని వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు ఇరగం సుబ్బారెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలతో వైద్యానికి ఆర్థిక సాయం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ఆపదలో ఉన్నామని దగ్గరకు వచ్చిన వారికి సాయం అందివ్వడానికి ఆయన ఎప్పుడూ ముందుంటారు.. రాయచోటికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైద్యం కోసం వినిపించుకున్న వారికి అక్కడికక్కడే ఆర్థికసాయం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి మనసున్న నాయకుడిగా మరో మారు నిలిచిన విషయం తెలిసిందే. సీఎం ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ లక్ష రూపాయలు వంతున సాయం అందించారు. చిన్నమండెం మండలం కోతులవాండ్లపల్లె గ్రామానికి చెందిన 11 సంవత్సరాల వయసు గల లక్ష్మీప్రసన్న సిస్టమిక్ లూపస్ ఎరితమాటోస్ వ్యాధితో బాధపడుతోందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా.. వెంటనే స్పందించి వ్యాధి చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తగిన ఆర్థిక, ఇతర సహాయాలను అందించాలని కలెక్టర్‌ని ఆదేశించారు. కలెక్టర్ గిరీషా పీఎస్ వెంటనే పాప తల్లి చల్లా లలితమ్మకు శుక్రవారం లక్ష రూపాయల చెక్కును అందించారు. ముఖ్యమంత్రి చేసిన సహాయానికి ముఖ్యమంత్రికి, జిల్లా కలెక్టర్‌లకు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

‘ఆడుదాం ఆంధ్ర’ను విజయవంతం చేయండి

రాయచోటి : డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు జిల్లాలో జరిగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తెలిపారు.

- ఎంపీఎఫ్‌సీ గోడౌన్, బీఎంసీయూల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

డీసీబీఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



రవి మృతదేహం

రాయచోటి టౌన్ : డీసీబీఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే రవి (36) అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాయచోటి పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన రవి 2009లో ఉద్యోగంలో చేరాడు. అన్నమయ్య జిల్లా ఏర్పడిన తరువాత జిల్లా పోలీస్ కార్యాలయంలో డీసీబీఆర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా లివర్ పాడైన రవి గత కొన్ని నెలలుగా తిరుపతి, కడప ఆస్పత్రులలో చికిత్స పొందాడు. అయినా పెద్దగా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఉదయం అందరికంటే ముందే జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నాడు. సహచరులు వచ్చి గమనించే సరికి ఆయన ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించండి

రాయచోటి : జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. శుక్రవారం రాయచోటిలోని కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు.

- జిల్లా కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో ఎన్నికల నాటికి పూర్తి చేయాల్సిన అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.
- జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి మత్తు పదార్థాల నియంత్రణపై జిల్లా కలెక్టర్ జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

‘ఆర్టీపీపీకి ఎంవీఆర్ పేరు’పై హర్షం

ప్రొద్దుటూరు క్రైం : ఆర్టీపీపీకి డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌గా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయడంపై ఎంవీఆర్ కుమారుడు మల్లేల రాజారాంరెడ్డి, రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ మల్లేల ఝాన్సీరాణి హర్షం వ్యక్తం చేశారు. వారు లింగాపురంలోని వారి స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ రమణారెడ్డి రాయలసీమ సమస్యలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఇందులో భాగంగానే 1985లో 21 రోజులు నిరాహార దీక్ష చేసిన ఫలితంగా నాటి ప్రభుత్వం రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటు వల్ల వేలాది మందికి ఉద్యోగాలు, పరోక్షంగా ఉపాధి లభించిందన్నారు. ఎంవీఆర్ పేరును ఆర్టీపీపీకి పెట్టడంపై ఎంవీఆర్ అభిమానులు, నాడు రాయలసీమ విమోచన సమితిలో పాల్గొని నిరాహార దీక్ష చేసిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.